

మోదీని ప్రశ్నించినందుకే..

ప్రధాని మోదీని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు.

- 8లో ▸



యమపాశాలు

వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ రైతులకు యమపాశాలుగా మారుతున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /21.7

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్		సహర్	
బుధ :	6:34	గురు :	4:50





ఇంటి బాట పట్టిన విద్యార్థులు



పరీక్షలు ముగియడంతో నగరంలోని ఓ కాలేజీ వద్ద విద్యార్థినుల ఆనందోత్సాహం

ఇంటిబాట

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగిశాయి. దీంతో విద్యార్థులు సందడి చేస్తూ కనిపించారు. పరీక్షలు ముగియగానే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు తమ లగేజీని పట్టుకొని ఇంటిదారి పట్టారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యూస్‌రీల్

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు ఎస్కలేటర్లు మంజూరు

సుభాష్‌నగర్: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు ఐదు ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరయ్యాయి. నగరంలో ఎస్కలేటర్ల నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రైల్వేశాఖ మంత్రి, రైల్వే అధికారులకు పలుమార్లు లేఖలు రాశారు. తన విన్నపానికి సానుకూలంగా స్పందించి లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేసినందుకు ఎంపీ అర్వింద్ రైల్వేశాఖ మంత్రి, రైల్వే అధికారులకు మంగళవారం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎంబీబీఎస్ పరీక్ష ఫలితాల విడుదల

- ఫస్ట్‌క్లాస్‌లో 75 మంది విద్యార్థులు

నిజామాబాద్ సిటీ: ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో నిజామాబాద్ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ప్రతిభ చాటారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ నిజామాబాద్ మెడికల్ కళాశాలకు చెందిన 2018 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు 98 మంది ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయగా పంచరెడ్డి నిఖిత టాపర్‌గా నిలిచింది. 75 మంది ప్రథమశ్రేణిలో, 22 మంది ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లకు రెడీగా ఉండాలి



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): ఎండాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్ సొసైటీల అధ్యక్షులకు సూచించారు. మంగళవారం స్థానిక ఐడీసీఎంఎస్ కార్యాలయంలో 53వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో 40కిపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, త్వరలో వీటిని ప్రారంభించుకోవాలన్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల సంఖ్య 15 ఉండగా, మూడేళ్లలో 50కి పెంచిన ఘనత ప్రస్తుత పాలకవర్గానికే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సహకార సంఘాలు బలోపేతం అవుతున్నాయన్నారు. అదే విధంగా 2021 ఏప్రిల్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు చేసిన వ్యాపారం, ఖర్చులు అలాగే వచ్చే ఏడాదికి ఆదాయ, వ్యయ అంచనాలను సమావేశంలో చర్చించి తీర్మానించారు. సొసైటీ చైర్మన్లకు గౌరవ వేతనాలు ఇవ్వాలని, ప్రోటోకాల్ అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు, డీసీవో సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్లు, బిజినెస్ మేనేజర్ నగేశ్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో వెనకడుగు



నందిపేట్ మండలం లక్కంపల్లి శివారులో పెరుగుతున్న ఆయిల్‌పాం మొక్కలు

- అనుకున్న స్థాయిలో జరగని ఆయిల్‌పాం పంట సాగు
- టార్గెట్‌లో 50 శాతం కూడా మించని వైనం
- ఆరు వేల ఎకరాలకు సాగైంది 2,650 ఎకరాలే..
- మిగులు లక్ష్యాన్ని వచ్చే ఏడాదిలో పూర్తి చేయాలని నిర్ణయించిన ఉద్యాన శాఖ

6,000	2,650	3,350
లక్ష్యం (ఎకరాల్లో)	ఇప్పటివరకు సాగైంది(ఎకరాల్లో)	సాగు చేయించాల్సింది(ఎకరాల్లో)

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో ఆయిల్‌పాం సాగు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. 2022–23 సంవత్సరానికి జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించడంలో ఉద్యాన శాఖ వెనుకబడింది. అధికారులు చేతులెత్తేయడంలో టార్గెట్‌లో కనీసం 50 శాతాన్ని కూడా మించలేదు. రైతులను చైతన్యం చేయడంలో విఫలమయ్యారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. తద్వారా జిల్లాలో ఆయిల్‌పాం సాగు అంతంతమాత్రంగానే జరుగుతోంది. కాగా రైతులు లాభదాయకమైన ఆయిల్‌పాం పంటను సాగుచేసే దిశగా చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో రాష్ట్ర శాఖ అసంతృప్తిగా ఉంది. గతేడాది జూన్, జూలై నెలలు కలిపి 2వేల ఎకరాలు, నవంబర్, డిసెంబర్ కలిపి నాలుగు వేల ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేయాలని ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. డిసెంబర్ నాటికే వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉండగా, రైతులు ముందుకు రాలేదు. ఉద్యాన శాఖ అధికారులతో కాకపోవడంతో వ్యవసాయాధికారుల సహాయంతో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి నాటికి 6వేల ఎకరాల్లో సాగు చేయించాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 2,650 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. వీటికి డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను కూడా మంజూరు చేశారు. అయితే మిగులు లక్ష్యాన్ని వచ్చే ఏడాదిలో పూర్తి చేయాలని ఉద్యాన శాఖ అధికారులు నిర్ణయించుకున్నారు.

సులభతర పంటలకు అలవాటైన రైతులు

ఆయిల్‌పాం పంటను సాగు చేయడానికి రైతులు పెద్దగా ముందుకు రాకపోవడానికి పలు కారణాలున్నాయి. అందులో ప్రధానంగా రైతులు సులభతర పంటలైన వరి, మొక్కజొన్న, సోయా ఇతర పంటలు సాగు చేయడం అలవాటుగా మారిపోయింది. ఏడాదిలో రెండు నుంచి మూడు పంటలు తీసి ప్రభుత్వానికి అమ్మడం పరిపాటిగా మారింది. దీంతో ఎక్కువ కాలం వేచి చూసే ఆయిల్ పాం పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఆర్థికంగా బాగున్న రైతులే ముందుకు వచ్చారు. సబ్సిడీపై ఆయిల్‌పాం మొక్కలను, అంతర పంటలు సాగు చేయడానికి ఆర్థిక సాయం, రాయితీపై డ్రిప్ పరికరాలు ఇస్తున్నా కూడా రైతులు ఈ పంటను వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. కాగా, ప్రభుత్వం అందించే సబ్సిడీ సకాలంలో రావడం లేదనే కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

జూన్ నుంచి మిగులు లక్ష్యాన్ని పూర్తిచేస్తాం

ఈ ఏడాదికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో 40 శాతం పూర్తి చేశాం. మిగిలిన లక్ష్యాన్ని జూన్ నెల నుంచి పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తాం. రైతులను మరింత చైతన్యం చేసి ఆయిల్ పాం వైపు మళ్లిస్తాం.

– నర్సింగ్‌దాస్, ఉద్యాన శాఖ అధికారి

హైవే విస్తరణకు సన్నాహాలు

- ఎన్‌హెచ్–63పై గ్రీన్ హైవేకు బదులుగా ఉన్న రోడ్డునే నాలుగు లైన్లుగా విస్తరణ
- అవసరమైన భూ సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ
- పెర్కిట్ నుంచి జిల్లా సరిహద్దు వరకు 26 కిలోమీటర్ల మేర పనులు

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో 63వ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించడానికి రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పెర్కిట్ నుంచి జిల్లా సరిహద్దు వరకు 26 కిలోమీటర్ల పొడవున రోడ్డు విస్తరణకు అవసరమైన భూ సేకరణ కోసం రెవెన్యూ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారినే విస్తరించడానికి నోటిఫికేషన్ జారీ కావడంతో గ్రీన్ హైవే నిర్మాణం ఇకలేనట్లే అని స్పష్టమవుతుంది. గ్రీన్ హైవే నిర్మాణం జరగకపోతే అనేక మంది రైతులు ఊపిరి పీల్చుకున్నట్లు అవుతుంది. మొదట జాతీయ రహదారి విస్తరణకు బదులు గ్రీన్ హైవే నిర్మాణం చేపట్టాలని నిర్దేశించి భూ సేకరణ కోసం సర్వే కూడా పూర్తి చేశారు. గ్రీన్ హైవే కారణంగా ఎంతో విలువైన వ్యవసాయ భూములను కోల్పోతున్నామని రైతులు ఆందోళన చెందారు. భూసేకరణను అడ్డుకుంటామని కూడా రైతులు హెచ్చరించారు. చివరకు జాతీయ రహదారినే విస్తరించాలని నిర్ణయం తీసుకోవడం విశేషం.

26 కిలోమీటర్లు, 72.26 హెక్టార్ల భూమి

జిల్లాలో విస్తరించే జాతీయ రహదారి పొడవు 26 కిలోమీటర్లు కాగా ఇందుకోసం 72.2671 హెక్టార్ల భూమి అవసరం అవుతుందని సంబంధిత శాఖ నిర్ణయించింది. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణ వల్ల జిల్లాలోని దొన్కల్, మోర్తాడ్, చేపూర్, కోటార్మూర్, పెర్కిట్, కమ్మర్‌పల్లి, అంక్సాపూర్, కుకునూర్, లక్కోరా, పడగల్‌లకు సంబంధించిన వ్యవసాయ భూములతో పాటు కొన్నిచోట్ల గృహ సముదాయాలకు నష్టం వాటిల్లనుంది. ఇప్పటి వరకు రెండు లైన్ల రోడ్డు ఉండగా నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తుంది. భూసేకరణకు నోటిఫికేషన్ జారీ కావడంతో భూములకు, గృహాలకు నష్ట పరిహారాన్ని త్వరలోనే నిర్ణయించనున్నారని తెలుస్తోంది.

మార్గదర్శకాల ప్రకారమే..

జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూమిని సేకరించడానికి ప్రభుత్వం గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తాం. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించే అవకాశం ఉంటుంది. భూ సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాసులు, ఆర్డీవో, ఆర్మూర్



నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించనున్న 63వ జాతీయ రహదారి

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఖలీల్‌వాడి: గుండె జబ్బులు ఎప్పుడు, ఎక్కడ ఏ విధంగా వస్తాయో తెలియడం లేదని సీపీఆర్‌ను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గుండె జబ్బుల నివారణ కోసం జిల్లా కేంద్రంలో శ్రీరామ గార్డెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుండె జబ్బులకు గురైన వారిని సీపీఆర్ ద్వారా రక్షించడం జరిగిందని పేర్కొన్నారు. సమాజంలో గుండె జబ్బు వచ్చి పడిపోయిన వారిని సీపీఆర్ ద్వారా బతికించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతిఒక్కరూ హెల్త్ కండీషన్ చూసుకోవాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారని, పోలీసులు ఎల్లప్పుడు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే దగ్గరలోని డాక్టర్‌ను త్వరగా సంప్రదించాలన్నారు. పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడితో ఉంటారని మంచి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్స్ కూడా గుండెజబ్బుల బారిన పడుతున్నారని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీపీఆర్ నేర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లాలకు ఈ కిట్స్ పంపించారని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక పద్ధతిగా ప్లానింగ్ చేసి ముందుకెళ్లాలన్నారు. అనంతరం గుండె వైద్య నిపుణులు చాణక్య కిశోర్ గుండె జబ్బుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో సీపీ నాగరాజు, డీఎంహెచ్‌వో సుదర్శనం, అదనపు డీసీపీ (ఏ ఆర్) గిరిరాజు, ఏవో మధుసూదన్ రావు, ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ, సంతోష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, డాక్టర్ సరళ పాల్గొన్నారు.

నాపైనా కేసులు పెడ్తరు

- అయినా భయపడేది లేదు
- ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: అవినీతి అక్రమాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అలవాటుగా మారిందని.. రేపు నాపైనా కేసులు పెడ్తారని అందుకు భయపడేది లేదని మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రధాని మోదీ అవినీతిని సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్నారని అందువల్లే ఆయన కూతురు కవితను కేసుల పేరుతో వేధిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. మోర్తాడ్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోదీ అవినీతిని రాహుల్ గాంధీ ప్రశ్నించినందుకు ఎంపీ పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. పసుపు సాగుచేసే రైతులకు ఎన్నో ఆశలు కల్పించిన ఎంపీ అర్వింద్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత వమ్ము చేశారని ఎద్దేవా చేశారు. అర్వింద్‌కు పసుపు రైతుల ఉసురు తగులుతుందన్నారు. పెద్దాయన డీఎస్‌కు జాతిరత్నాలాంటి ఇద్దరు కొడుకులు ఉన్నారని ఆయన లాంటి పరిస్థితి ఎవరికీ రావద్దని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ చరిత్రలో 90వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాలు లీక్ కావడం దురదృష్టకరమన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌లు ఏది పడితే అది మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, నాయకులు డాక్టర్ మధుశేఖర్, నర్సింహా నాయుడు, మోర్తాడ్ సర్పంచ్ భోగ ధరణి తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు..

- మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాల్లేవు
- ట్రెజరీల్లోనే నెలల తరబడి చెక్కులు

సుభాష్‌నగర్: గ్రామాల్లోని మురికి కాల్వలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా చేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడే మల్టీపర్పస్ వర్కర్లకు (పంచాయతీ కార్మికులు) మూడు నెలలుగా వేతనాలు రావడంలేదు. జనవరి నుంచి మార్చి ముగియనున్నా.. జీతా లు రాకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నా రు. సంక్రాంతి, ఉగాది పండుగల వేళల్లో కొన్ని గ్రామాల్లో సర్పంచులు సర్దుబాటు చేస్తున్నా.. మరికొన్ని గ్రామాల్లో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నుంచి జీతాలు చెల్లించాలని ఆదేశాలున్నా.. తప్పనిసరి పరిస్థితుల్లో జనరల్ ఫండ్ నుంచే ఇస్తున్నారు. జీతాల చెక్కులు కూడా ట్రెజరీల్లో నెలలతరబడి మూలుగుతున్నాయని పలువురు సర్పంచులు వాపోతున్నారు.

విధుల్లో 2,445 మంది

జిల్లాలో 530 పంచాయతీలున్నాయి. అందులో 2,445 మంది మల్టీపర్పస్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఉండాల్సిన వర్కర్ల కంటే 20 శాతం వరకు తక్కువగా ఉన్నారని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో కార్మికుడికి నెలకు రూ. 8,500 చొప్పున వేతనం చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. కార్మికులకు వేతనాలను జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు.

జనరల్ ఫండ్ నుంచే చెల్లింపులు..

జీపీలకు 2022 ఏప్రిల్ నుంచి ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల కావడంలేదు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఫండ్ విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులు మాత్రం అరకొరగానే వచ్చాయి. ఆ నిధులు రాకపోవడంతో పంచాయతీలకు నెలవారీ ఖర్చులు భారంగా మారాయి. పంచాయతీ కార్మికుల వేతనాలకు చెల్లించలేని పరిస్థితి దాపురించింది. గత్యంతరం లేక పన్నులు వసూలు చేసిన నగదు జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసి, అందులో నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో సర్పంచులే సర్దు బాటు చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు(ఫైల్)

చెక్కులు పాస్ కాక..

జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించేందుకు చెక్కులు ట్రెజరీకి పంపిస్తున్నారు. అక్కడే నెలల తరబడి చెక్కులు పాస్ కావడం లేదు. ఖాతాలు ఫ్రీజింగ్ ఉండడం వల్ల నెలల తరబడి మూలుగుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు విడుదలైతే ట్రెజరీతో సంబంధం లేకుండా చెక్కు ద్వారా వేతనాలు త్వరగా చెల్లించే అవకాశం ఉంటుంది. కానీ నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

వేతన చెక్కులు ఆపడం లేదు



మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆ నిధుల నుంచే వేతనాలు చెల్లించాలి. ప్రస్తుతం జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఆ చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని చెబుతున్నాం.

– డాక్టర్ జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

ఇల్లు గడవడం కష్టంగా మారింది



పంచాయతీ కార్మికులతో అన్నిరకాల పనులు చేయించుకుంటూ వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. మూణ్నెల్లుగా జీతాలు రాక ఇల్లు గడవడం కష్టమైతుంది. వెంటనే వారికి జీతాలు చెల్లించాలి. లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తాం.

– నూర్జహాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

రజత పతక విజేతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి) : ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఆల్‌ ఇండియా ఇంటర్‌ యూనివర్సిటీ కిక్‌ బాక్సింగ్‌ ఉమెన్స్‌ టోర్నీ -2023లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పథకం సాధించిన పవార్‌ ఉమను మంగళవారం తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఉమ గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ సెకండ్‌ ఇయర్‌ చదువుతోంది. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్‌ ఇంచార్జీ సంపత్‌, ఉమ కోచ్‌ పీ.శ్రీనివాస్‌, గిరిరాజ్‌ కళాశాల పీడీ బి బాలమణి, వర్సిటి ఫిజికల్‌ డైరక్టర్‌ బీఆర్‌ నేత, కిక్‌బాక్సింగ్‌ క్రీడాకారులు పాల్గొన్నారు.

కరోనా తర్వాత విద్యావిధానంలో మార్పులు



నిజామాబాద్‌ అర్బన్‌ : కరోనా కంటే ముందు ఉన్న విద్యావిధానంలో కంటే కరోనా తర్వాత విధానంలో చాలా మార్పులొచ్చాయని తమిళనాడు అన్నామలై యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ వీణ పేర్కొన్నారు. మంగళవారం సారంగపూర్‌లో రెండో రోజు జాతీయ విద్యావిధానం -2020 అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కరోనాకు ముందు విద్యా టెక్నాలజీలో అంతగా అభివృద్ధిలేదని ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి పెరుగుతుందన్నారు. ఇన్ఫర్మేషన్‌ కమ్యూనికేషన్‌ టెక్నాలజీతో పదేళ్లలో విద్యావిధానం మరింతగా మారనున్నందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'స్వయం' అనే పోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ పోర్టల్‌ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా అనేక కోర్సులను నేర్చుకోవచ్చన్నారు. మొబైల్‌ లేకుండా ఈ రోజుల్లో గంట కూడా ఉండలేకపోతున్నామన్నారు. ఈ సదస్సులో జిల్లాలోని బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనారిటీ యువతకు శిక్షణ



నిజామాబాద్‌ నాగారం : జిల్లాలో ఉన్న మైనారిటీ యువతకు న్యాక్‌ ద్వారా కన్‌స్ట్రక్షన్‌ విభాగంలో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్‌ ప్రభాకర్‌ తెలిపారు. మంగళవారం నగరంలోని ఐటీఐ ఆవరణలో ఉన్న న్యాక్‌ శిక్షణ కేంద్రంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. 3 నెలల పాటు కన్‌స్ట్రక్షన్‌ విభాగంలో సూపర్‌వైజర్‌ పోస్టు కోసం శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వడానికి నిరుద్యోగులను తీసుకురావడంతో కృషి చేసినందుకు సయ్యద్‌కైసర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాక్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సరోజ, జమాతే ఇస్లామి ప్రతినిధి షేక్‌ హుస్సేన్‌, అబ్దుల్‌ అలీం, మైనారిటీ యువత తదితరులు పాల్గొన్నారు.

యమపాశాలు

పల్లెల్లో.. పట్టణాల్లో విద్యుత్‌ తీగలు మృత్యుతీగలుగా మారి పలు కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నాయి. భీమ్‌గల్‌ మండలంలోని పలు గ్రామాల్లో కిందకు వేలాడుతున్న తీగలతో పశువులే కాదు.. మనుషులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు.

- ప్రమాదకరంగా విద్యుత్‌ తీగలు
- పొలాల వద్ద పొంచి ఉన్న ముప్పు
- సరి చేయాలని రైతుల వేడుకోలు



గాంధీనగర్‌ కాలనీ నుంచి కుప్కల్‌ వెళ్లే దారిలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్‌ తీగలు



పురాణిపేట్‌ గ్రామంలో లింబాద్రి గుట్టకు వెళ్లే దారిలో వేలాడుతున్న విద్యుత్‌ తీగలు

భీమ్‌గల్‌ : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్‌ తీగలు కిందికి వేలాడుతూ రైతులకు మయపాశాలుగా మారాయి. దీంతో రైతులు, పశువుల కాపరులు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటేనే బయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్నిసార్లు విద్యుత్‌ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందులో వేలాడే విద్యుత్‌ తీగలను, ఒరిగిన స్తంభాలను సరిచేయడం తుప్పుపట్టిన స్తంభాల తొలగింపుతో పాటు ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడం వంటి పనులు చేపట్టారు. కాని ప్రభుత్వం ఆదేశాలను బేఖాతర్‌ చేస్తూ తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆయా ప్రాంతాల్లో..

మండలంలోని పురాణిపేట్‌ గ్రామంలో లింబాద్రి గుట్టకు వెళ్లే దారిలో, గాంధీనగర్‌ కాలనీ నుంచి కుప్కల్‌ వెళ్లే దారిలో విద్యుత్‌ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. పొలం పనులు చేసేటప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పని చేయాల్సిన పరిస్థితి తయారైందని వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో కిందికి వేలాడుతున్న విద్యుత్‌ తీగల వద్ద, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పశువులు, పలు గ్రామాల్లో మనుషులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ప్రాణాలు పోతేనే విద్యుత్‌ తీగలను సరి చేస్తారా అని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

తక్షణమే స్పందించాలి..



అధికారులకు సమస్య గురించి తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే సమస్యను పరిష్కరించాలి. లేకపోతే అనేక ఇబ్బందులు వచ్చే అవకాశాలున్నాయి. – కిష్టి కిషన్‌, బాబాపూర్‌

మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌పై వేటు

- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు
- మాజీ మంత్రి సుదర్శన్‌ రెడ్డి
- బోధన్‌లో సత్యాగ్రహ దీక్ష



బోధన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌ రెడ్డి

బోధన్‌ : పార్లమెంట్‌లో మోదీ, అదానీల మధ్య బంధాన్ని రాహుల్‌ ప్రశ్నించినందుకే కుట్ర పూరితంగా ఆయన చట్టసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేశారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వ్యక్తులకు ఈడీ నోటీసులు జారీ చేసి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్‌ గాంధీపై అనర్హత వేటు, కేంద్ర బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో నియోజక వర్గ స్థాయి సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దీక్షలో కూర్చున్న సుదర్శన్‌ రెడ్డి మాట్లాడుతూ అదానీ ఆర్థిక వ్యవహారాలపై పార్లమెంట్‌లో చర్చ జరుగాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు నిత్యావసర సరుకులు, చమురు ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. కాంగ్రెస్‌ హయాంలో సిలిండర్‌ ధర రూ. 400 ఉంటే ఇప్పుడు రూ.1,200లకు పెంచారన్నారు. ప్రజాస్వామ్య, ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సత్యాగ్రహ దీక్షకు బోధన్‌ నియోజక వర్గంలోని కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలి వచ్చారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్‌, ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌, డెలిగేట్‌ గంగా శంకర్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ గౌసోద్దీన్‌, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినోద్దీన్‌, నాయకులు పులి శ్రీనివాస్‌, మోబిన్‌ ఖాన్‌, రాజేశ్వర్‌ పటేల్‌ తదితరులున్నారు.

బీఈడీ పరీక్ష తేదీల్లో మార్పులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో ఏప్రిల్‌ 3 నుంచి ప్రారంభమయ్యే బీఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ థియరీ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల వినతి మేరకు పలు సబ్జెక్టుల పరీక్షల తేదీలు మార్చినట్లు కంట్రోలర్‌ తెలిపారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల బీఈడీ విద్యార్థులు ఈ విషయం గమనించాలని, పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

తెల్ల చొక్కాపై చెరగని జ్ఞాపకం..



ఓ ప్రైవేట్‌ కళాశాల వద్ద విద్యార్థి షర్ట్‌పై ఆటోగ్రాఫ్‌ ఇస్తున్న అతడి స్నేహితులు

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయ్‌.. ముందుగానే పరీక్షలకు ప్రిపేర్‌ అయ్యేందుకు విద్యార్థులకు సెలవులిచ్చేశారు.. దీంతో ఇన్నాళ్లు కలిసి చదువుకున్న విద్యార్థులు భారంగానే ఒకరినొకరు వీడుతూ బెస్ట్‌ ఆఫ్‌ లక్‌ చెప్పుకున్నారు. ఇందులో భాగంగా నగరంలో ఓ ప్రైవేట్‌ పాఠశాల వద్ద ఓ విద్యార్థి చొక్కాపై మిత్ర బృందం అంతా ఇలా సంతకాలు చేసి తమ స్నేహితుడికి వీడ్కోలు పలికారు. – సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌–నిజామాబాద్‌

ప్రాచీన చరిత్రకు నిలయం తెలంగాణ

- తెయూ వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌



తెలంగాణ చరిత్ర కాంగ్రెస్‌ సదస్సులో మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి రవీందర్‌

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ ప్రాంతం ప్రాచీన చరిత్రకు నిలయమని, నిజామాబాద్‌ జిల్లా చరిత్ర కూడా ఎంతో ప్రాచీనమైనదని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌ అన్నారు. తెయూ క్యాంపస్‌ లా కళాశాల సెమినార్‌హాల్‌లో మంగళవారం తెలంగాణ చరిత్ర కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జ్యోతివెలిగించి ప్రారంభించారు. 'నిజాం సంస్థానంలో ఆనాటి రైల్వే వ్యవస్థ' అనే అంశంపై హైదరాబాద్‌ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ కేఎస్‌ఎస్‌ శేషన్‌ నిజాం నాటి రైల్వే వ్యవస్థపైన కీలక ప్రసంగం చేశారు. హర్యానా, కురుక్షేత్ర విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ రవీంద్ర కుమార్‌ శర్మ, తెయూ ఇంచార్జీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్‌ కే.అర్జునరావు, డాక్టర్‌ జైకిసాన్‌, ఆర్‌ సూర్యకుమార్‌ సదస్సులో ప్రసంగించారు. తెలంగాణ చరిత్ర కాంగ్రెస్‌ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ వెంకటరాజం ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తెలంగాణ చరిత్ర కాంగ్రెస్‌ కార్యదర్శి వీరేందర్‌ సదస్సు లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త బాల శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు బి.సాయిలు, సీహెచ్‌ ఆంజనేయులు, కే.రవీందర్‌ రెడ్డి, మహమ్మద్‌ అబ్దుల్‌ఖవి, వి.త్రివేణి, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెయూతో ట్యాలీ సంస్థ ఎంఓయూ

తెయూ, ట్యాలీ ఎడ్యుకేషన్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీ మధ్య ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం ట్యాలీ ప్రాంతీయ సహాయ నిర్వాహకులు మల్లేష్‌ గుప్తా, తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌, ఇంచార్జీ రిజిస్ట్రార్‌ విద్యావర్ధిని ఒప్పంద అవగాహన (ఎంఓయూ) పత్రాల మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి, మేనేజ్‌మెంట్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ కె.అపర్ణ, జి.శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

బయో ఇన్ఫర్మాటిక్స్‌ నూతన ల్యాబ్‌

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ బయోటెక్నాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన బయో ఇన్ఫర్మాటిక్స్‌ ల్యాబ్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌ మంగళవారం ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ ఏర్పాటుకు అంతర్జాతీయ కంపెనీ ఇంటెల్‌ ఆర్థిక సాయం అందించగా, మరో కంపెనీ యునైటెడ్‌ వే సహకరించినట్లు వీసీ తెలిపారు. ఈ ల్యాబ్‌లో 30 కంప్యూటర్లు, ఒక వర్క్‌స్టేషన్‌ ఉన్నట్లు తెలిపారు. ఈ ల్యాబ్‌ ఏర్పాటుకు రూ.48లక్షలు మంజూరుకు కృషి చేసిన ఐక్యూఏసీ డైరెక్టర్‌ మామిడాల ప్రవీణ్‌ ను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యార్థిని, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఆరతి, విభాగాధిపతి జవేరియా, ప్రొఫెసర్‌ కనకయ్య, బాలకిషన్‌ తదితరులున్నారు.

వేసవిలో చెరువుల అలుగులు పారుతున్నాయ్‌



అమీనాపూర్‌ సమీపంలో చెరువులకు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌ : సీఎం కేసీఆర్‌ వల్ల ఎండాకాలంలో చెరువులు అలుగులు పారుతున్నాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మోర్తాడ్‌ పర్యటన ముగించుకొని వేల్పూర్‌ వెళ్తుండగా అమీనాపూర్‌ వద్ద కాలువలో ప్రవహిస్తున్న గుత్ప, నవాబు లిఫ్టుల నీటిని చూసి సంబురపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్ప, నవాబు లిఫ్టుల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో చెరువులు అలుగులు పారుతున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు లిఫ్టుల ద్వారా వేల్పూర్‌ మండలంలో వేల్పూర్‌, అమీనాపూర్‌, కుకునూర్‌, లక్కోర, కోమన్‌పల్లి, వెంకటాపూర్‌, అంక్సాపూర్‌, దొన్కల్‌ గ్రామాలలోని 12 చెరువులు మండుటెండల్లో అలుగులు పారడం ఆనందంగా ఉందన్నారు.

నిందితురాలిని పట్టించిన సీసీ ఫుటేజీ

ఖలీల్‌వాడి : సీసీ ఫుటేజీ ఆధారంగా మార్కెట్‌లో డబ్బులు చోరీ చేసిన మహిళను అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20న నగరంలోని దేవిరోడ్డులో ఆకుల ప్రగత్‌ తన భార్య బంగారాన్ని ఓ గోల్‌ మర్చంట్‌ వద్ద తాకట్టు పెట్టి రూ. 4 లక్షలు తీసుకున్నారు. అనంతరం దేవిరోడ్డులోని కిరాణాషాపు వద్ద సామాను కొనేందుకు వెళ్లి షాపులో తన డబ్బుల బ్యాగును పక్కన పట్టి, సామాను కొనుగోలు చేశారన్నారు. సామాను కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాగ్‌ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దుకాణంలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వర్ని రోడ్డులోని చంద్రనగర్‌కు చెందిన బియాస్‌ వనజను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మహిళను పట్టుకున్న ఏఎస్సై షకీల్‌, రాజేష్‌, గంగారాం, అబ్దుల్‌ రహామాన్‌ను ఏసీపీ అభినందించారు.

భర్తకు జైలు శిక్ష

- భార్య ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు..

బోధన్‌: భార్యను వేధించి ఆమె ఆత్మహత్యకు కారకుడైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్షణ, రూ.200 జరిమాన విధిస్తూ బోధన్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి దేవన్‌ అజయ్‌ కుమార్‌ మంగళవారం తీర్పును వెల్లడించారు. జరిమానా కట్టకపోతే మరో నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్షణ అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ డాక్టర్‌ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం కోటగిరి మండలంలోని (ప్రస్తుతం పోతంగల్‌) దోమలెడ్గి గ్రామానికి చెందిన నాగమణి, బోధన్‌కు చెందిన కొప్పుల గజేందర్‌ ప్రేమించుకుని 2007 జనవరి 24న పెళ్లి చేసుకున్నారు. వీరికి కూతురు హనీష్‌, కొడుకు సాయి హనీష్‌ ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత భార్యభర్తల మధ్య తగాదాలు జరుగుతుండేవన్నారు. 2019 ఫిబ్రవరి 24న గజేందర్‌ తన తమ్ముడి పెళ్లికి వెళ్లే విషయంలో భార్య నాగమణితో గొడవ జరిగింది. పెళ్లికి వచ్చేందుకు ఆమె నిరాకరించడంతో ఆమెను కొట్టాడు. మళ్లీ ఇంటికి తిరిగి వచ్చి రాత్రి సమయంలో నాగమణిని కొట్టి బయటకు వెళ్లిపోయాడు. మనస్తాపంలో అదేరోజు అర్ధరాత్రి సమయంలో నాగమణి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరుసటి రోజు 2019 ఫిబ్రవరి 25న మృతురాలి తల్లి కోడూరు లక్ష్మి శ్యామల బోధన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అల్లుడు గజేందర్‌ కోటగిరి గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తన కూతురు నాగమణిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయడంతోనే ఆమె మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చదువులో నేనెప్పడూ ముందే..



బాన్సువాడ రూరల్‌ : ''ఇదే పాఠశాలలో నేను 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నా.. రెండు గదులు, పూరిపాక ఉండేవి. ప్రతిసారి నేను ఫస్ట్‌ వచ్చేవాడిని..1954 నుంచి 1959వరకు చదువుకున్న సమయంలో నా గురువు మోజెస్‌ నన్ను చాలా ప్రోత్సహించేవారు'' అంటూ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. మంగళవారం బా న్సు వాడ మండలంలోని ఇబ్రహీంపేట్‌ గ్రామంలో మన ఊరు -మనబ డి కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కామారెడ్డి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. గు రువు మోజెస్‌ తనను ఇంగ్లిష్‌, గణితం బాగా చదివి భవిష్యత్‌లో ఇంజినీర్‌ కావాలని ప్రోత్సహించడంతో తాను ఇంజనీరింగ్‌ చేశానన్నా రు. చదువుకునే రోజుల్లో రెండో క్లాస్‌ నుంచి ఎప్పుడూ క్లాస్‌ ఫస్ట్‌ లే దా సెకండ్‌ వచ్చేవాడినన్నారు. నేను మీ పాఠశాలలోనే చదువుకున్నా ను కాబట్టి మీరంతా నా స్కూల్‌మేట్స్‌ అంటూ చిన్నారులను ఉత్సాహపర్చారు. ప్రస్తుతం ఇబ్రహీంపేట్‌ సర్పంచ్‌గా ఉన్న నా రా యణరెడ్డి తన బావమరిది అని వారి అక్క పుష్పను వివాహమాడి ఈ ఊరి అల్లుడిని అయ్యానన్నారు.

పీడీ యాక్ట్‌ నమోదు

కామారెడ్డి టౌన్‌ : తరచూ నేరాలు చేస్తూ కామారెడ్డి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై పీడీ యాక్ట్‌ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ బి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్‌ కాలనీకి చెందిన 30 ఏళ్ల యువకుడు బొజ్జ విష్ణు అలియాస్‌ పోచాద్రి, అలియాస్‌ పోచయ్య నేరస్తుడిపై పీడీ యాక్ట్‌ కేసు నమోదు చేసి మంగళవారం చంచల్‌గూడ జైలుకు పంపినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో పోలీసు అధికారిగా నటిస్తూ దొంగతనాలు, దోపిడీ, హత్యాయత్నం వంటి నేరాలను తరుచుగా పాల్పడుతున్నట్లు తెలిపారు. 2017 నుంచి బోయిన్‌పల్లి, ఎల్‌బీ నగర్‌, కామారెడ్డి పట్టణం, దేవున్‌పల్లి, మాచారెడ్డి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో 9 నేరాలు చేసాడన్నారు. ఈ సంఘటనలన్నింటి ఆధారంగా అతడిపై పీడీ యాక్ట్‌ నమోదు చేశామన్నారు. పీడీ యాక్ట్‌ ఉత్వర్వులను పట్టణ సీఐ నరేష్‌ నేరస్తుడికి అందజేసి చంచల్‌గూడ జైలుకు అప్పగించారు.

సిరిధాన్యాలపై ప్రచారం చేయాలి



నిజామాబాద్‌ సిటీ : పోషక లోపాలను నివారిస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సిరిధాన్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి ఏప్రిల్‌ 3వ తేదీ వరకు కొనసాగుతున్న పోషణ్‌ పక్వాడ కార్యక్రమం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా మాట్లాడారు. పోషణ పక్వాడలో సర్పంచ్‌లు, జీపీ కార్యదర్శులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు సిరిధాన్యాల అంశంపై పోటీలు నిర్వహించాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో కిశోర బాలికలకు అనీమియా (హెచ్‌బీ టెస్ట్‌) పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనంను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారికి అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్‌ లీకేజీలను అరికట్టాలని మిషన్‌ భగీరథ, పంచాయతీ రాజ్‌ ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ అధికారిణి కే.సుధారాణి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, వ్యవసాయ అధికారి వాజీద్‌ హుస్సేన్‌, సీడీపీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.